సాక్షి
రంగారెడ్డి
మంగళవారం : 29 : ఏప్రిల్ : 2025



పిల్లలు భద్రం

వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలను ఓ కంట కనిపెడుతూ ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలి. 8లో▸



కారు బ్రేక్ డౌన్..

పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై బ్రేక్‌డౌన్ అయిన కారును వేగంగా దూసుకొచ్చిన మరో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. 8లో▸



నకిలీ రివాల్వర్‌తో బెదిరించి

నకిలీ రివాల్వర్‌తో ఓ వ్యక్తిని బెదిరించి రూ.5.25 లక్షలను దోచుకున్న ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి బాబూజీ మహరాజ్ ఉత్సవాలు



కన్హా శాంతివనం

నందిగామ: కన్హా శాంతి వనంలో మంగళవారం నుంచి మే 1వ తేదీ వరకు బాబూజీ మహరాజ్ 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ చంద్రారెడ్డి తెలిపారు. భారతీయ సాంస్కృతిక శాఖ సహకారంతో హార్ట్ ఫుల్‌నెస్ గ్లోబల్‌గైడ్ కమ్లేష్ డి.పటేల్(దాజీ) ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభ్యాసీలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపించండి



కందుకూరులో ఇళ్ల స్థలాలు కేటాయించిన భూమిలో లబ్ధిదారులు

కందుకూరు: కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ల (788, 107)లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం కందుకూరుకు వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులు ర్యాలీగా భూముల వద్దకు వెళ్లి, చదను చేసే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, లబ్ధిదారులు జి.శ్రీశైలం, చిన్నమయ్య, ఆర్.శేఖర్, దాసు, యాదమ్మ, సక్కుబాయి, రామలక్ష్మి, జంగమ్మ, శంకరమ్మ, బాలమణి, అలివేలు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- ప్రజావాణికి 51 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ సంగీత అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా.. సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 51 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండలాల తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'సారథి' ప్రారంభం

సికింద్రాబాద్ ఆర్టీఏలో ప్రారంభించనున్న మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలను మరింత సులభతరం చేసే లక్ష్యంతో చేపట్టిన అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ 'వాహన్ సారథి' ఈ నెల 30వ తేదీన సికింద్రాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రారంభం కానుంది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సారథిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వాహనాల వివరాల నమోదు కోసం ఇప్పటికే ఢిల్లీ కేంద్రంగా 'వాహన్' పోర్టల్ సేవలను అందజేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా 'సారథి'ని నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని మొత్తం వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను ఈ పోర్టల్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా వాహనదారులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లినప్పుడు ఎన్‌ఓసీలతో నిమిత్తం లేకుండా నేరుగా కొత్త ప్రాంతంలో డ్రైవింగ్ లైసెన్సులను పొందవచ్చు. 'సారథి' ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల వివరాలను పొందేందుకు అవకాశం ఉంటుంది. అలాగే దీని సేవలను మరింత విస్తృతం చేసి ఇంటి నుంచే లెర్నింగ్ లైసెన్సుల కోసం పరీక్షలు రాసి ఎల్‌ఎల్‌ఆర్‌లు పొందేవిధంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఉంది.

అక్రమాలకు పట్టా!



అన్యాక్రాంతమవుతున్న భూదాన్ భూములు

జిల్లాలోని భూదాన్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కళ్లముందే ఇవి కరిగిపోతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీనికి తోడు రికార్డులు తారుమారు చేస్తూ ప్రభుత్వ భూములను పట్టాగా మార్చేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా పెద్దమొత్తంలో లబ్ధిపొందుతున్నారు. ఈ అక్రమాలపై పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

- 21,931 ఎకరాలకు.. మిగిలింది ఏడు వేల ఎకరాలే
- మహేశ్వరం, యాచారం, హయత్‌నగర్, శేరిలింగంపల్లిలో ఆక్రమణలు
- మెజారిటీ భూములకు పట్టాలు సృష్టించిన వైనం
- కోర్టు కేసులతో ఒక్కొక్కటిగా వెలుగులోకి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆచార్య వినోబాభావే పిలుపు మేరకు 1954లో జిల్లా వ్యాప్తంగా 168 మంది దాతలు 21,931.03 ఎకరాల భూమిని భూదాన్ యజ్ఞబోర్డుకు దానం చేశారు. మొట్టమొదట వెదిరే రామచంద్రారెడ్డి వంద ఎకరాలు దానం చేశారు. ఇలా దాతలు బహూకరించిన భూమిలో కొంత భాగాన్ని 9,678 మంది స్థానిక పేదలకు బోర్డు అసైన్ చేసింది. వీటిని అమ్మడం, కొనడం నేరం. కానీ 22- ఏ జాబితాలో ఉండాల్సిన విలువైన భూములు పట్టాగా మారాయి. ప్రస్తుతం ఏడు వేల ఎకరాలకే పరిమితమయ్యాయి. వీటిలోనూ చాలా వరకు వివాదాల్లో చిక్కుకున్నాయి.

పేదలు వర్సెస్.. రియల్టర్లు

హయత్‌నగర్ మండలం కుంట్లూరులోని 214 నుంచి 224 వరకు ఉన్న సర్వే నంబర్లలో వంద ఎకరాల భూదాన్ భూములు ఉన్నాయి. సీపీఐ ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితం మూడు వేల మందికిపైగా పేదలు ఇందులో గుడిసెలు వేశారు. ఈ భూములు తమవేనంటూ స్థానికంగా ఉన్న కొంత మంది పత్రాలు సృష్టించారు. గత శనివారం ఇక్కడ వెలుగు చూసిన అగ్ని ప్రమాదంలో 300పైగా గుడిసెలు పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే.

కబ్జాదారుల చెరలోనే..

మహేశ్వరం మండలం మంఖాల్ సర్వే నంబర్ 435లో 12 ఎకరాల భూదాన్ భూములున్నాయి. 1955- 58 చేసాల పహాణి ప్రకారం ఈ భూమి ఫకీర్ మహ్మద్ పేరున ఉంది. ఆయన దీన్ని భూదాన్ బోర్డుకు ఇచ్చారు. 1979- 80 నుంచి 1985- 86 వరకు భూదాన సమితి పేరున రికార్డయింది. ఆ తర్వాత బోర్డు ఈ భూమిని స్థానికంగా ఉన్న నలుగురు పేదలకు అసైన్ చేసింది. అనంతరం ఈ భూమి పక్కనే ఉన్న ప్రైవేటు పట్టా భూ యజమాని చేతుల్లోకి వెళ్లింది. శేరిలింగంపల్లి మండలం వట్టినాగులపల్లి సర్వే నంబర్లు 186, 187, 188, 189లలో 29.27 ఎకరాల భూదాన్ భూములు అన్యాక్రాంతమయ్యాయి.

పరిహారం స్వాహా..

యాచారం మండలం తాడిపర్తికి చెందిన బొక్క సీతారెడ్డి కుటుంబం సర్వే నంబర్ 104లో 250 ఎకరాలను భూదాన్ బోర్డుకు దానం చేసింది. యాచారం రెవెన్యూ రికార్డుల్లో 2020 వరకు ఇవి భూదాన్ బోర్డు పేరునే ఉన్నాయి. అనంతరం కొంత మంది పెద్దలు వీటిని పట్టా భూములుగా మార్చేశారు. ఈ భూములను ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించడంతో అప్పటికే వీటిని ఆక్రమించిన వారు పరిహారం పొందారు. ఇలా 78 మంది స్థానికేతరులు ఎకరానికి రూ.12.50 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు తీసుకున్నారు.

కందుకూరులోనూ విచారణ

కందుకూరు మండలం తిమ్మాపూర్‌లోని 6, 129, 130, 147, 161, 167, 197, 444, 453, 454, 473, 474, 475 సర్వేనంబర్లలో 111 ఎకరాల భూదాన్ భూములు ఉన్నాయి. ఇక్కడ ఎకరం రూ.2 కోట్లకు పైగా పలుకుతోంది. 1951 భూదాన ఉద్యమంలో భాగంగా భారీగా భూములున్న పలువురు రైతులు కొంత భూమిని బోర్డుకు రాసిచ్చారు. ఆ తర్వాత బోర్డు స్థానికంగా ఉన్న పేదలకు పంపిణీ చేసింది. కొంత మంది రియల్టర్లు తక్కువ ధరకే వీటిని కొట్టేశారు. ధరణిని అడ్డం పెట్టుకుని పట్టా భూములుగా మార్చారు.

మోకిల భూములపై స్టే

శంకర్‌పల్లి మండలం కొండకల్- మోకిల సరిహద్దులో 76.24 ఎకరాల బిలాదాఖలా భూములు ఉన్నాయి. 45 మంది స్థానిక రైతులు ఇందులో సాగు చేసేవారు. కొంత మంది రియల్టర్లు తక్కువ ధరకే వీటిని తీసుకున్నారు. అనంతరం 2022 డిసెంబర్ 29న విలేజ్ మ్యాప్‌లో సవరణ చేయడంతో పాటు సర్వే నంబర్ 555 సృష్టించి, బైనంబర్లు వేసి పట్టాగా మార్చేశారు. ఇలా ఇప్పటికే 26 ఎకరాలను రియల్టర్లకు కట్టబెట్టారు. కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌పై ఆగ్రహం వ్యక్తంచేసిన హైకోర్టు దీనిపై స్టే విధించింది.

హైకోర్టు నోటీసులు

మహేశ్వరం మండలం నాగారం సర్వే నంబర్లు 181, 182, 194, 195లో వంద ఎకరాలకుపైగా భూదాన్ భూములున్నాయి. వీటిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయకపోవడం కబ్జాదారులకు కలిసొచ్చింది. అత్యంత విలువైన ఈ భూములపై కొంతమంది అక్రమార్కుల కన్నుపడింది. తప్పుడు పత్రాలు సృష్టించి పట్టా భూములుగా మార్చేశారు. అనంతరం తక్కువ ధరకే అమ్మకానికి పెట్టడంతో ప్రభుత్వ శాఖల్లోని కీలక పదవుల్లో ఉన్నవారు తమ కుటుంబ సభ్యుల పేర్లతో పది నుంచి ఇరవై గుంటల చొప్పున కొనుగోలు చేశారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఇటీవల హైకోర్టు వీరందరికీ నోటీసులు చేసింది.

గొర్రెల దొంగల బీభత్సం

- మంద వద్ద కాపలాగా ఉన్న కానిస్టేబుల్‌పై కత్తులతో దాడి
- మరో వ్యక్తిని సైతం గాయపర్చిన దుండగులు
- రూ.5 వేల నగదు, 30 గొర్రెలతో ఉడాయింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు

హయత్‌నగర్: గొర్రెల మంద వద్ద కాపలాగా పడుకున్న ఓ కానిస్టేబుల్‌తో పాటు అతని బావమర్దిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు. అనంతరం 30 గొర్రెలు, నగదును అపహరించుకుని పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ గ్రామానికి చెందిన రాసూరి నవీన్ కుషాయిగూడ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. వీరికి 250 వరకు గొర్రెలు ఉన్నాయి. నవీన్ తండ్రి శ్రీశైలం వీటిని కాస్తుంటాడు. ఇటీవల ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రిలో చేరాడు. దీంతో ఆదివారం రాత్రి నవీన్, అతని బావమరిది శ్రీకాంత్ గ్రామ సమీపంలోని బాల్‌రెడ్డి పొలం వద్ద ఉన్న గొర్రెల మంద వద్దకు కాపలాగా వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో సుమారు ఎనిమిది నుంచి తొమ్మిది మంది గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెల మంద వద్దకు వచ్చి నవీన్, శ్రీకాంత్ ఫోన్లు లాక్కున్నారు. అనంతరం కత్తులతో నవీన్‌పై దాడి చేశారు. అతని తల, కన్ను, భుజంపై గాయపరిచారు. శ్రీకాంత్ ముఖంపై కొట్టడంతో కంటికి తీవ్ర గాయమైంది. వీరు తేరుకునే లోపు రూ.5 వేల నగదును లాక్కున్నారు. అనంతరం 30 గొర్రెలను బొలేరో వాహనంలో వేసుకుని పారిపోయారు. అనంతరం గ్రామానికి వెళ్లిన బాధితులు స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు.

దుండగులను పట్టుకుంటాం

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. దుండగులు హిందీలో మాట్లాడారని, బొలేరో వాహనాన్ని గుర్తించేందుకు సీసీ టీవీలను పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, దుండగుల దాడిలో గాయపడ్డ కానిస్టేబుల్ నవీన్

వేపచెట్టుకు వినతులు కట్టి..!

- తలకిందులుగా వేలాడిన యువరైతు
- తన భూ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థన



వేప చెట్టు కొమ్మకు తలకిందులుగా వేలాడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న జీవన్

ఇబ్రహీంపట్నం: రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా భూ సమస్య పట్టించుకోకపోవడంతో ఓ యువ రైతు వినూత్నంగా నిరసన చేపట్టారు. మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన పి.జీవన్ తన తల్లి జయసుధ పేరుపై సర్వేనంబర్ 374లో ఎకరం 32 గుంటల భూమిని 2006లో కొనుగోలు చేశారు. ధరణి పోర్టల్ వచ్చిన అనంతరం నిషేధిత జాబితాలో ఆ భూమిని చేర్చారు. దీన్ని సవరించాలని తహసీల్దార్,ఆర్డీఓ, కలెక్టర్,ముఖ్యమంత్రి కార్యాలయాల చుట్టూ తిరిగి వినతులు సమర్పించినా ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలోనే గతేడాది ఆగస్టులో తహసీల్దార్ కార్యాలయంలో శీర్షాసనం వేసి నిరసన వ్యక్తం చేశాడు. అప్పట్లో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అయితే నెలలు గడిచినా చలనం లేకపోవడంతో మళ్లీ ఆందోళన బాట పట్టారు. తన పొలంలోని వేప చెట్టుకు వినతిపత్రాలు కట్టి.. కొమ్మకు తన కాళ్లను చుట్టి తలకిందులుగా వేలాడుతూ నిరసన తెలిపారు. ఈ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. తనది పేద కుటుంబమని, అధికారులు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ప్రస్తుతం ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.374 సర్వే నంబర్‌లో 10.03 ఎకరాల భూమి ఉండగా అందులో ఎకరా 22 గుంటలను సీలింగ్ కింద డిక్లేర్ చేశారు. ధరణి పోర్టల్ వచ్చిన అనంతరం ఈ సర్వేనంబర్‌లోని భూమిని నిషేధిత జాబితాలో చేర్చారు.ఈ అంశం ఉన్నతాధికారుల వద్దకు చేరింది.

– సునీత, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

సాగర్‌రోడ్డుపై ఉద్రిక్తత

హోంగార్డ్ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువుల ధర్నా

- ఇరువైపులా ట్రాఫిక్ జామ్
- ఇబ్రహీంపట్నం ఏసీపీ చొరవతో శాంతించిన ఆందోళనకారులు



గునుగల్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

యాచారం: మండలంలోని గునుగల్ గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైనేజీ కాల్వ నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి గ్రామానికి చెందిన హోంగార్డ్ మేడిపల్లి వెంకటేశ్ ఛాతిలో నొప్పితో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే ఊరికి చెందిన ప్రశాంత్, పవన్‌ల కుటుంబ సభ్యులు కొట్టడంతోనే హోంగార్డ్ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు బాధితులు ఆరోపించారు. తమని ఆదుకోవాలని సోమవారం సాయంత్రం గునుగల్ గేట్ వద్ద సాగర్‌రోడ్డుపై మృతుడి భార్య స్వాతి, పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సాగర్ రహదారి ఇరువైపులా భారీగా ట్రాఫిక్‌జాం అయింది. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని, ఘర్షణ పడిన వారిని అదుపులోకి తీసుకున్నామని తెలియజేశారు. అయినా ఆందోళనకారులు వినకపోవడంతో పోలీసులు స్వల్ప లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరోవైపు మృతుడి బంధువులు ఉదయం ప్రశాంత్, పవన్‌ల ఇళ్లల్లోని వస్తువులకు నిప్పు పెట్టే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో గ్రామంలో పోలీసుల పహారా ఏర్పాటు చేశారు.

ఇక భూ సమస్యలుండవ్

శాశ్వత పరిష్కారానికే 'భూ భారతి' అమలు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి
- అబ్దుల్లాపూర్‌మెట్, కందుకూరులో అవగాహన సదస్సులు



అబ్దుల్లాపూర్‌మెట్ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నిర్దిష్టమైన గడువులోపు రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని తార కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చట్టంలోని మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కలెక్టర్ నారాయణరెడ్డి వీటిని క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా భూభారతి పోర్టల్‌ను రూపొందించారన్నారు. దీనిద్వారా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. త్వరలోనే రెవెన్యూ అధికారులు గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు.

రెండంచెల వ్యవస్థ..

ధరణిలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం అన్ని అంశాలను పొందుపరుస్తూ భూభారతిని తెచ్చిందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. దీనిద్వారా సెక్షన్- 4లోని సబ్ సెక్షన్లు 4, 5 ప్రకారం భూ రికార్డులను సవరించుకునే అవకాశం కల్పించారని వివరించారు. భూ విస్తీర్ణంలో మార్పులు, రికార్డుల్లో నమోదు కాని విస్తీర్ణం వంటి సమస్యలను తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో పరిశీలించి, పరిష్కరించే అధికారులు ఇచ్చిందన్నారు. మే, జూన్ మాసాల్లో అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ సదస్సులు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ స్పష్టంచేశారు. భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను ఉంటుందని వివరించారు. తహసీల్దార్ స్థాయిలో చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి రైతు సంతృప్తి చెందకపోతే 60 రోజుల్లోపు ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చని, అక్కడ కూడా న్యాయం జరగలేదని భావిస్తే.. 30 రోజుల్లోపు కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలోనే భూకమతాల వారీగా భూధార్ సంఖ్య కేటాయిస్తారని కలెక్టర్ తెలిపారు. భూముల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని నెదర్లాండ్ మాజీ మంత్రి బెర్ట్ కోలేందేర్స్ అన్నారు. భూ భారతి చట్టాన్ని తమ దేశంలోనూ అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. సదస్సులో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల హక్కులు భద్రం..



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

కందుకూరు: భూ భారతి చట్టంతో రైతుల హక్కులు భద్రంగా ఉంటాయని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కందుకూరులోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచే రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా ఈ చట్టాన్ని రూపొందించారని తెలిపారు. వ్యవసాయ పొలాలతో పాటు వ్యవసాయేతర భూములకు సంబంధించిన ప్రతీ సర్వే నంబర్ ఇందులో రికార్డు అవుతుందని స్పష్టంచేశారు. ఈ చట్టం ద్వారా పేద, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా అందుతుందని వివరించారు. రంగారెడ్డి జిల్లాలోనే భూ సమస్యలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో కందుకూరు మండలం కూడా ఒకటని స్పష్టంచేశారు. టీయూడీఐఎఫ్‌సీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ధరణితో రైతులు అనేక అవస్థలు పడ్డారని, భూ భారతితో అవన్నీ తీరనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, నాయబ్ తహసీల్దార్ శేఖర్, ఏఓ లావణ్య, ఎంపీఓ గీతారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పూలబాట.. వాహనదారుల ఊరట

మండుతున్న ఎండలకు ఆకుపచ్చని అందాలు వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. వేడిమి నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. చల్లని నీడను ఇస్తున్నాయి. ఈ ప్రకృతి సోయగం మంచాల– ఇబ్రహీంపట్నం రహదారికి ఇరువైపులా దర్శనమిస్తోంది. ఏపుగా పెరిగిన పూలు తదితర చెట్లు కనువిందు చేస్తూ బాటసారులను ఆకట్టుకున్నాయి.

– మంచాల



నోముల– ఇబ్రహీంపట్నం రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

కష్టపడిన వారికే గుర్తింపు, ప్రాధాన్యం

మైలార్‌దేవ్‌పల్లి: పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తుందని జాతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాపయ్యగౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్ ఆధ్వర్యంలో సోమవారం సంఘటన సంరచన పార్టీ సంస్థగత నిర్మాణం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా వారు హాజరై మాట్లాడారు. అందరిని కలుపుకుని, అందుబాటులో ఉండే వ్యక్తికి, సమయం ఇచ్చే వ్యక్తికి పార్టీ పదవులు ఇస్తుందన్నారు. ఆశావహుల పేర్లు, వివరాలు సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, జోగి రవి, రావుల భాస్కర్, సంతుగౌడ్, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నెల్లుట్ల జగన్, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, వెంకటరమణగుప్తా, బబ్లు, మన్మోహన్‌రెడ్డి, అడికే రాజు, ఎన్ను శంకర్‌రెడ్డి, కె.బాబు, వినయ్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మీర్‌పేట: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం ఓ వ్యక్తి(60) బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్ఎల్ఎన్ఎస్ కమాన్ వద్ద మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, కొంత కాలంగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించామని, తెలిసిన వారు ఉంటే మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



మృతదేహం



కొడిచర్ల చెరువు



ఈత కోసం వెళ్లి మునిగి మృతి చెందిన విద్యార్థులు (ఫైల్)

సెలవుల సమయం..
పిల్లలు భద్రం

చిన్నారులను ఓ కంట కనిపెట్టాలి

- చెరువులు, బావుల వద్దకు వెళ్లకుండా చూడాలి

కొత్తూరు: ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. చదువు కోసం హాస్టళ్లు, పట్టణాల్లో ఉండే విద్యార్థులు తమ సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. వారు చదువుకునే సమయాల్లో ఆటలపై సరిగ్గా దృష్టి పెట్టలేదు. దీంతో ఇంటికి చేరుకున్న విద్యార్థులు మండుటెండలో సైతం క్రికెట్‌తో పాటు పలు క్రీడలు ఆడుతున్నారు. మరికొందరు గ్రామాలకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న చెరువులు, కొలనుల్లో ఈత కోసం వెళ్తున్నారు. సరైన జాగ్రత్తలు, పర్యవేక్షణ కొరవడితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. మండలంలోని పలు చెరువుల్లోని గుంతల్లో అభం శుభం తెలియని చిన్నారులు సెలవుల్లో ఈత కోసం వెళ్లి మృత్యువాత పడిన ఘటనలు చాలా ఉన్నాయి.

పర్యవేక్షణ తప్పనిసరి

▲ వేసవి సెలవుల కోసం ఇళ్లకు చేరుకున్న తమ పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతుండాలి. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆటలు ఆడకుండా చూడాలి.

▲ విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పకుండా గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటల్లోకి ఈత కోసం వెళ్తుంటారు. దీంతో పిల్లలకు చెరువుల్లో ఉన్న లోతు గుంతల గురించి తెలియజేయాలి.

▲ ఈత కొలనులు, చెరువుల్లో ఈత నేర్చుకునే చిన్నారులను తల్లిదండ్రులు వెంట తీసుకెళ్లాలి.

▲ సాయంత్రం 5 గంటల తర్వాతనే బయట ఆడుకునే విధంగా అవగాహన కల్పించాలి.

▲ ఎండ కారణంగా వడదెబ్బకు గురైతే సొంత వైద్యం కాకుండా ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించి చికిత్స అందించాలి.

▲ ముఖ్యంగా వేసవిలో సాధ్యమైనంత వరకు సులువుగా జీర్ణమైయ్యే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.

గతంలో ఘటనలు

కొత్తూరు మండలంలోని కొడిచర్ల పంచాయతీ ఖాజీగూడతండాలో 2014లో పెద్ద విషాదం చోటు చేసుకుంది. వేసవి సెలవుల్లో భాగంగా ప్రభుత్వ హస్టళ్లలో చదువుతున్న తండాకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఇళ్లకు వచ్చారు. వారు ఈత కోసం సమీపంలోని చెరువులోకి వెళ్లి అందులో పడి మృతి చెందారు. ఇన్ముల్‌నర్వ గ్రామ సమీపంలోని జేపీ దర్గా ఆవరణలో ఉన్న పీరం చెరువులో సైతం దర్గా దర్శనం కోసం వచ్చిన పలువురు విద్యార్థులు ఈత కోసం దిగి మునిగి మృతి చెందారు. సిద్ధాపూర్‌లోని క్రషర్ ప్లాంట్ల కోసం తవ్విన గుంతల్లో ఈత కోసం దిగి పలువురు మృత్యువాత పడ్డారు.

అవమానిస్తున్నాడని..

బావను హత్య చేసిన బావమరిది



మృతదేహం

బౌద్ధనగర్: అందరిలో అవమానిస్తూ అవమానిస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తి తన బావను హత్య చేసిన సంఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముషీరాబాద్‌కు చెందిన రుక్కాల శ్యాంసన్‌రాజ్ (38) పదేళ్ల క్రితం భార్యా పిల్లలను వదిలేసి ఫిష్ మార్కెట్‌లో పనిచేస్తూ పుట్‌పాత్‌పై ఉంటున్నాడు. కొన్నేళ్ల క్రితం లోన్ రికవరీ చేసే లాజరస్‌కు శ్యాంసన్ సోదరిని ఇచ్చి వివాహం జరిపించారు. ఇద్దరూ కలిసి తరచూ మద్యం తాగేవారు. అందరితో కలిసి ఉన్నప్పుడు శ్యాంసన్‌రాజ్ లాజరస్‌ను అవమానించేలా మాట్లాడేవాడు. ఆదివారం రాత్రి వారు పార్శీగుట్ట ఎదురుగా ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం భవనంపై కూర్చుని మద్యం సేవించారు. అదే సందర్భంగా శ్యాంసన్‌రాజ్ లాజరస్‌ను అవమానించడంతో ఆగ్రహానికి లోనైన లాజరస్ అక్కడే ఉన్న ఇనుపరాడ్‌తో శ్యాంసన్‌రాజ్ తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం దీనిని గుర్తించిన స్థానికులు 100 డయల్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనుమానితుల జాబితాలో ఉన్న లాజరస్‌ను అదుపులోకి తీసుకుపి ప్రశ్నించగా తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం. కాగా పోలీసులు ఇంకా విచారణ కొనసాగుతుందని తెలిపారు. అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సీఐ రమేష్‌గౌడ్ పరిశీలించారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపండి

శాంతి చర్చల పీస్ కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఆపరేషన్ కగార్‌ను ఆపాలని శాంతి చర్చల పీస్ కమిటీ చైర్మన్, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి సీపీఐ (మావోయిస్టు) పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండా ఆదివాసీలపై దమనకాండకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షుడు జంపన్న మాట్లాడుతూ ఆదివాసుల సంక్షేమం దృష్ట్యా ఇరు పక్షాలు శాంతిని పాటించాలన్నారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఆదివాసులను నిర్వాసితులను చేస్తూ ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఐదు ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు, పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి విజయ్, డీఎస్‌ఏ రాష్ట్ర కోకన్వీనర్ గణేశ్, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

దుబాయ్‌లో వ్యాపారినని చెప్పి..

- నగర వాసికి నిలువు దోపిడీ
- కోర్టు ఆదేశాల మేరకు నిందితురాలిపై కేసు నమోదు

ఫిలింనగర్: తాను యూఏఈ సిటిజన్‌నని, తనకు దుబాయ్‌లో వ్యాపారాలు ఉన్నాయని, ప్రముఖ సినీ హీరోలు తన కజిన్స్ అని నమ్మించి హైదరాబాద్‌కు చెందిన ఓ బడా పారిశ్రామికవేత్తను పెళ్లి చేసుకుని అడ్డదారిలో రూ. కోట్లు నొక్కేసి రోడ్డు పాలు చేసిన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి సబ్జాకాలనీకి చెందిన సయ్యద్ హసన్ అలీ మేనిఫెస్ట్ సొల్యూషన్స్, మేనిఫెస్ట్ డెవలపర్స్, కాన్సెప్ట్ వన్ టెక్నాలజీ ఎండీగా వ్యవహరిస్తున్నాడు. 2021లో అతడికి టిండర్ ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ద్వారా ఓ యువతితో పరిచయం ఏర్పడింది. తాను దుబాయ్‌లో ఉంటానని, వ్యాపారాలు ఉన్నాయని, తన బాయ్‌ఫ్రెండ్‌తో వచ్చిన విబేధాల వల్ల తన తల్లితో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చినట్లు చెప్పింది. ఇద్దరూ మాట్లాడుకునేందుకు హైటెక్ సిటీలోని ఓ స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసి హసన్ ఆలీని అక్కడికి రప్పించింది. ఇద్దరూ వ్యాపార లావాదేవీలు, కుటుంబ విషయాలు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత 2022లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం వారికి హుస్సేనీ అలంలో నిఖా జరిగింది. ఇద్దరూ కలిసి ఫిలింనగర్‌లో ఓ ఫ్లాట్‌ను తీసుకుని కాపురం ఉన్నారు. ఇదే సమయంలో ఆమె భర్త హసన్ అలీకి చెందిన బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఆస్తులు, వ్యాపారాలకు సంబంధించిన వివరాలు సేకరించింది. మెల్లగా అతడి నుంచి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించింది. రూ.2 కోట్లు ఒకసారి, ఆ తర్వాత పలు మార్లు రూ.కోట్లు తన అకౌంట్‌లోకి బదిలీ చేసుకుంది. హసన్ ఆలీ ఇంట్లో లేని సమయంలో ఐఫోన్ పాస్‌వర్డ్ తెలుసుకుని అందులో నుంచి నేరుగా డబ్బులను తన అకౌంట్‌లోకి బదిలీ చేసుకునేది. అంతేగాక తన తల్లికి ఓ ఫ్లాట్ కొనుగోలు చేసి ఇచ్చింది. ఈ డబ్బుల వ్యవహారంలో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె వివరాలపై ఆరా తీసిన హసన్ ఆలీకి ఆమెకు అప్పటికే యూఏఈలో పెళ్లి జరిగిందని, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఓ బ్యాంక్‌ను మోసగించిన ఘటనలో యూఏఈలో తొమ్మిది నెలలు జైలు శిక్ష కూడా అనుభవించిందని, యూఏఈకి రాకపోకలు నిషేధించినట్లు తేలింది. దీంతో అతను తనను మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలంటూ ఫిలింనగర్ పోలీసులకు గత సెప్టెంబర్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు మహిళలపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ రివాల్వర్‌తో బెదిరించి
రూ.5.25 లక్షలు దోపిడీ

ఆరుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఐ సతీష్

దుండిగల్: నకిలీ రివాల్వర్‌తో ఓ వ్యక్తిని బెదిరించి రూ.5.25 లక్షలను దోచుకున్న ముఠాను దుండిగల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. దుండిగల్ డీఐ సతీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి అపర్ణ సెనిటరీ ప్రాంతానికి చెందిన బలగం వినోద్ కుమార్ అతని స్నేహితుడు తరుణ్ గతంలో స్టార్టప్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. అయితే సదరు సంస్థలో వినోద్ రూ. 50 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉండగా అదే సమయంలో అతడికి న్యూజిలాండ్‌లో ఉద్యోగం రావడంతో పెట్టుబడి డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోయాడు. ఇటీవల అతను నగరానికి తిరిగి వచ్చాడు. న్యూజిలాండ్ వెళ్లిన వినోద్ పెద్ద డబ్బులు సంపాదించాడని భావించిన తరుణ్ అతడిని బెదిరిస్తే సులువుగా డబ్బులు రాబట్టవచ్చునని భావించాడు. ఇందులో భాగంగా తన స్నేహితులైన హైదరాబాద్‌కు చెందిన సాయి కృష్ణ యాదవ్, వివేక్ రాజ్ సింగ్, సంగారెడ్డికి చెందిన సందీప్, మణిదీప్, దేవేందర్, సుమంత్, మనోజ్‌లను ఉసిగొల్పాడు. దీంతో వారు వినోద్‌ను కిడ్నాప్ చేసేందుకు పథకం రూపొందించారు. ఇందులో భాగంగా తరుణ్ మినహా మిగతా వారంతా ఈ నెల 23న కొంపల్లిలోని వినోద్ ఇంటి వద్ద కాపు కాశారు. కారులో బయటికి వెళ్తున్న వినోద్‌ను వెంబడించి బౌరంపేటలోని స్నేక్ పార్క్ వద్ద అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న నకిలీ రివాల్వర్‌తో అతడిని బెదిరించి తమతో పాటు మేడ్చల్ జిల్లా కండ్లకోయకు తీసుకెళ్లారు. క్రిప్టో కరెన్సీలో వచ్చిన డబ్బులను తమకు ఇవ్వాలని డిమాండ్ చేయగా, తాను బిట్ కాయిన్లలో ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదని చెప్పడంతో అతడిని బెదిరించి అకౌంట్‌లో ఉన్న రూ.5.25 లక్షలను తమ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. మరుసటి రోజు ఉదయం అతడిని జేఎన్‌టీయూలో వదిలి పారిపోయారు. ఆ తర్వాత పలు మార్లు వినోద్‌కు ఫోన్లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తుండడంతో బాధితుడు దుండిగల్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం నిందితులు సాయి కృష్ణ యాదవ్, సందీప్, మణిదీప్, వివేక్ రాజ్ సింగ్, దేవేందర్‌గౌడ్, సుమంత్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.5.25 లక్షల నగదు, నకిలీ రివాల్వర్, కత్తి, కారు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారులు తరుణ్, మనోజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు మృతిచెందిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై హసీనా కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బార్కాస్ సలాల ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆసీఫ్ (40) పెయింటర్‌గా పని చేసేవాడు. ఆదివారం తను తన స్నేహితులు మరో ఇద్దరితో కలిసి చింతల్‌కు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఫారూక్‌నగర్ డిపోకు చెందిన బస్సును ఎక్కారు. ఇద్దరు స్నేహితులు నాంపల్లి వద్ద దిగిపోగా ఆసీఫ్ బస్సులోనే ఉన్నాడు. అఫ్జల్‌గంజ్ మలుపు వద్ద అతను సీటు పైనుంచి పడిపోవడంతో తోటి ప్రయాణికులు అతన్ని లేపి సీటుపై కూర్చొబెట్టారు. రాత్రి 11 గంటలకు బస్సు డిపోకు చేరుకున్న తర్వాత సిబ్బంది అతడిని నిద్రలేపేందుకు యత్నించగా స్పందించలేదు. దీంతో వారు పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఒప్పుకోకపోతే మొహంపై యాసిడ్ పోస్తా..

వివాహితకు వరుసకు సోదరుడి బెదిరింపులు

బంజారాహిల్స్: వివాహితపై కన్నేసిన ఆమెకు వరుసకు సోదరుడైన యువకుడు తన గదికి వచ్చి కోరిక తీర్చకపోతే మోహంపై యాసిడ్ పోస్తానంటూ బెదిరించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌లో నివసించే మహిళకు (26)కు ముగ్గురు సంతానం. ఆమెకు భర్తకు దూరపు బంధువైన నవీన్ అనే యువకుడు నగరంలోనే ఉంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తరచూ ఇంటికి వచ్చే అతను ఆమెతో మాటలు కలుపుతూ తన కోరికను బయటపెట్టేవాడు. తాను అడిగింది ఇవ్వకపోతే పరువు తీస్తానంటూ బెదిరించేవాడు. రెండు నెలల క్రితం బాధితురాలు ఈ విషయం తనకు భర్తకు చెప్పడంతో అప్పటి నుంచి నవీన్ ఆమెకు ఫోన్ చేయడం మానేశాడు. ఈ నెల 26న కొందరి వద్ద నవీన్ ఆమెపై అసభ్యకరంగా ప్రచారం చేశాడు. ఆమె పనిచేస్తున్న సెలూన్‌కు వెళ్లి నువ్వు బయటకు వస్తావా..? నన్ను లోపలికి రమ్మంటావా? అంటూ బెదిరించాడు. తాను బయటకు రానని చెప్పడంతో నువ్వు నా గదికి రాకపోతే మొహంపై యాసిడ్ పోసి చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు నవీన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బ్రేక్ డౌన్..
ఢీకొట్టిన మరో కారు

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఘటన



ఇండికా కారును ఢీకొట్టిన స్విఫ్ట్ డిజైర్

రాజేంద్రనగర్: పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై బ్రేక్‌డౌన్ అయిన కారును వేగంగా దూసుకొచ్చిన మరో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వేగానికి బ్రేక్ డౌన్ అయిన కారు పల్టీ కొట్టి ఎక్స్‌ప్రెస్ వే ప్రహరీని ఢీకొట్టింది. మరింత వేగంగా ఢీకొట్టి ఉంటే కారు ఎక్స్‌ప్రెస్ వేపై నుంచి కింది రోడ్డుపై పడి ఉండేది. ఈ సంఘటనలో కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన మహ్మద్ నియాజ్ తన ఇండికా కారులో ఎక్స్‌ప్రెస్ వే మీదుగా మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వెళుతున్నాడు. పిల్లర్ నంబర్ 257 వద్దకు రాగానే కారు బ్రేక్‌డౌన్ అయ్యింది. ముందుకు కదలలేని స్థితిలో ఉండటంతో కారును అలాగే పార్కు చేసి సూచిక బోర్డు పెట్టేందుకు కిందికి దిగాడు. ఇదే సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారులో శంషాబాద్ వైపు వెళుతున్న సయ్యద్ అమీరుద్దీన్ కారు బ్రేక్‌డౌన్ అయిన విషయాన్ని గుర్తించక వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. దీంతో కారు పల్టీ కొట్టి ప్రహరీ దిమ్మెను తాకింది. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ వేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

లాటరీ పేరుతో లాగేశారు!

- నగరవాసి నుంచి రూ.3.18 లక్షలు స్వాహా
- కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సుదీర్ఘకాలం తర్వాత లాటరీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. కేరళ లాటరీ పేరుతో నగరవాసికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.3.18 లక్షలు కాజేశారు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి (76) ఫేస్‌బుక్‌లో లాటరీ పేరుతో ప్రకటన కనిపించింది. ఆయన దానిని క్లిక్ చేసిన వెంటనే... వాట్సాప్‌కు రూట్ అయింది. ఆపై బాధితుడితో సంప్రదింపులు ప్రారంభించిన సైబర్ నేరగాళ్లు కేరళ ప్రభుత్వం ఏడాదికి ఒకసారి నిర్వహించే డ్రా అంటూ నమ్మించారు. వీరి వల్లోపడిన బాధితుడు మూడు టిక్కెట్లు ఖరీదు చేశారు. కొన్నాళ్లకు రెండు టిక్కెట్లు డ్రాలో ఎంపికైనట్లు, రూ.5 లక్షలు, రూ.12 లక్షలు చొప్పున ప్రైజ్‌మనీ రానున్నట్లు మెసేజ్ వచ్చింది. ఆపై మళ్లీ సంప్రదించిన నేరగాళ్లు ఆ మొత్తం తీసుకోవాలంటూ తొలుత కొన్ని ట్యాక్స్‌లు చార్జీలు చెల్లించాలన్నారు. రకరకాల పేర్లు చెప్పి రూ.3,18,148 కాజేశారు. మరికొంత మొత్తం డిమాండ్ చేయడంతో బాధితుడు ఇవ్వనని చెప్పాడు. అప్పటి నుంచి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్న నేరగాళ్లు స్పందించట్లేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.